సాక్షి నిర్మల్

మంగళవారం । 1 । ఆగస్టు । 2023



స్టీల్ బ్యాంక్ C/o గుండంపల్లి

రోజురోజుకూ ప్లాస్టిక్ వినియోగం పెరుగుతోంది. ఎన్నో అనర్థాలకు దారితీస్తోంది. ప్లాస్టిక్ వాడకం తగ్గించేలా గుండంపల్లి గ్రామ పంచాయతీ స్టీల్ బ్యాంక్ ఏర్పాటు చేసింది. 8లో▸

10 వరకు ఓపెన్ స్కూల్ ఫీజు గడువు

నిర్మల్ రూరల్: తెలంగాణ స్టేట్ ఓపెన్ స్కూల్ లో చదువుతున్న విద్యార్థులు ఈనెల 10 లోపు ఫీజు చెల్లించాలని జిల్లా పరీక్షల అధికారి పద్మ తెలిపారు. పదో తరగతి లేదా ఇంటర్మీడియట్ చదివే ఓపెన్ స్కూల్ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అపరాధ రుసుముతో ఈనెల 31 వరకు ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
29.5 /24.2

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. రుతుపవనాలు, అల్పపీడన ద్రోణి ప్రభావంతో చాలా ప్రాంతాల్లో జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాలు



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కిశోర్

భైంసాటౌన్: ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా నూతన పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని సుభద్రవాటిక శిశుమందిర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కుంట ప్రాంతం, కాటన్ మార్కెట్‌యార్డులోని పోలింగ్ కేంద్రాలను సోమవారం పరిశీలించారు. ఇప్పటికే 88 పోలింగ్ కేంద్రాలుండగా, అదనంగా మరో నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌ఐ కృష్ణ ఉన్నారు.

సదర్మాట్ పనులు పూర్తి చేయాలని వినతి



అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతులు

కడెం: సదర్మాట్ కాలువకు శాశ్వత మరమ్మతులు చేయించాలని కడెం మండలానికి చెందిన ఆయకట్టు రైతులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో సోమవారం అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఖానాపూర్ మండలం నడింపల్లి వద్ద యూటీ మరమ్మతులను, పలు చోట్ల కాలుకు పడిన గండ్లకు మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రైతులు దుల్లె వెంకటేశ్, గంగాధర్, అశోక్, కృష్ణయ్య ఉన్నారు.

'స్వర్ణ' కుడి కాలువకు నీటి విడుదల

సారంగపూర్: మండలంలోని స్వర్ణ ప్రాజెక్టు ఆయకట్టుకు కుడికాలువ ద్వారా ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి సోమవారం నీటిని విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు రెండు పంటలకు సరిపడా నీరందించే సామర్థ్యానికి ప్రాజెక్టు నీటిమట్టం చేరుకుందన్నారు. వ్యవసాయాధికారులు ప్రతీ గ్రామంలో పర్యటించి ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందించాలని సూచించారు.

2న ఎస్‌జీఎఫ్‌పై సమావేశం

నిర్మల్ రూరల్: పాఠశాల క్రీడల నిర్వహణపై జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు డీఈవో రవీందర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి వై.రమణరావు తెలిపారు. ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఉదయం 10 గంటలకు సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లా, జోనల్, రాష్ట్రస్థాయి టోర్నమెంట్ తేదీలు, వేదికలను ఈ సమావేశంలో ఖరారు చేస్తామని తెలిపారు. ఆసక్తి గల వ్యాయామ ఉపాధ్యాయులు ప్రతిపాదనలతో రావాలని సూచించారు.

పోటెత్తిన వరద



ఇటీవల కడెం గేట్లు ఎత్తడంతో దిగువకు వెళ్తున్న వరద

- సాగునీటి ప్రాజెక్టులకు భారీగా నీరు
- జలాశయాల సామర్థ్యానికి మించి ఇన్‌ఫ్లో
- ప్రధాన ప్రాజెక్టుల నుంచి దిగువకు 243 టీఎంసీలకు పైగా విడుదల

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల/కడెం: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రధాన సాగునీటి ప్రాజెక్టులకు వరద నీరు పోటెత్తింది. ఇటీవల కురిసిన వర్షాలకు భారీగా వరద చేరడంతో ఆయకట్టుకు ఢోకా లేకుండా పోయింది. ఈ వానాకాలం ఆరంభంలో వర్షాలు కురుస్తాయా? లేవా ? అనే సందేహం తలెత్తింది. జూన్ రెండో వారం నుంచి మొదలై జూలై మూడో వారం వరకు కూడా కొన్ని మండలాల్లో లోటు వర్షపాతమే నమోదైంది. అన్నదాతలు విత్తనాలు వేసి ఆకాశంవైపు చూశారు. జూలై మూడో వారం నుంచి క్రమంగా వర్షాలు ముసురుగా మొదలై ఎడతెరపి లేకుండా కుండపోతగా కురిశాయి. దీంతో ఉమ్మడి జిల్లాలో ప్రధాన సాగునీటి ప్రాజెక్టులు జలకళ సంతరించుకున్నాయి. పూర్తి స్థాయిలో నిండడమే కాకుండా ఒక్కో ప్రాజెక్టు సామర్థ్యం మించి వరద దిగువకు వెళ్లింది. అటు గోదావరి, ఉప నది, ఇతర వాగులు, వంకలపై నిర్మించిన మధ్యతరహా ప్రాజెక్టుల్లోనూ భారీగా నీరు చేరింది. ఒక్కో సాగునీటి ప్రాజెక్టుకు వాటి సామర్థ్యం కన్నా అనేక రెట్లు ఎక్కువగా నీటిని దిగువకు విడుదల చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల నుంచి 243 టీఎంసీల కన్నా అధికంగానే నీరు దిగువకు వెళ్లిపోయింది. ప్రధాన ప్రాజెక్టుల వివరాలు పరిశీలిస్తే ఇలా ఉన్నాయి.

ఎల్లంపల్లికి భారీగా ఇన్‌ఫ్లో



గోదావరి నదిపై నిర్మించిన ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తి స్థామర్థ్యం 20టీఎంసీలు. వరుసగా కురిసిన వర్షాలతో ఈ నెల 28న మొత్తం 62 గేట్లలో 47గేట్లు ఎత్తి ఈ సీజన్‌లోనే ఇప్పటివరకు గరిష్ఠంగా 9.32లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఆ సమయంలో ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 9.02లక్షలుగా ఉంది. దీంతో గోదావరి దిగువకు భారీగా నీటిని విడుదల చేశారు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 197టీఎంసీల వరద రాగా, 185టీఎంసీల నీటిని వరద గేట్లు ఎత్తి విడుదల చేశారు. వర్షాలు తగ్గాక నీటి విడుదల నిలిపివేశారు. ఒక దశలో మంచిర్యాల పట్టణంతోపాటు పరీవా హక ప్రాంతమంతా అప్రమత్తంగా ఉండాల్సి వచ్చింది. ఇక హైదరాబాద్‌కు తాగు నీటికి, ప్రాజెక్టు నుంచి అవసరం మేరకు నీటిని విడుదల చేస్తున్నారు.

'కుమురం భీం'కు భారీగా..

ఆసిఫాబాద్ మండలం అడ వద్ద నిర్మించిన కుమురంభీం ప్రాజెక్టు మొత్తం సామర్థ్యం 10టీఎంసీలు కాగా, ప్రస్తుతం 5.461టీఎంసీల నిల్వ ఉంది. ఈ సీజన్‌లో అత్యధికంగా 59వేల క్యూసెక్కుల వరకు ఇన్‌ఫ్లో వచ్చింది. ఆ సమయంలో అధికారులు ప్రాజెక్టు గేట్లు ఎత్తి 60వేల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు వదిలారు.

జూన్ 1నుంచి జూలై 31వరకు మొత్తం ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో వివరాలు(టీఎంసీల్లో)

ప్రాజెక్టు	సామర్థ్యం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో	ప్రస్తుతం
ఎల్లంపల్లి	20	197.904	185.020	16.66
కుమురంభీం	10	8.063	8.41041	5.461
కడెం	7.603	40.351	38.099	4.932
వట్టివాగు	2.89	1.7618	1.049	2.201
గడ్డెన్నవాగు	1.852	6.681	5.967	1.476
స్వర్ణ	1.484	4.42	3.4	0.946
సాత్నాల	1.240	2.737	1.970	0.844

కడెం గేట్ల పైనుంచి..



కడెం ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం700(7.603టీఎంసీ)అడుగులు, కానీ ప్రాజెక్ట్‌లో మూడు టీఎంసీలకు పైగా పూడిక పేరుకుపోయింది. దీంతో నీటి నిల్వ సామర్థ్యం 4 టీఎంసీలకే పరిమితమైంది. వానాకాలం పంటలకే చివరి ఆయకట్టు వరకు పూర్తి స్థాయిలో సాగు నీటిని విడుదల చేస్తున్నారు. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో వర్షాలు కురిస్తే యాసంగి పంటలకు సాగునీటిని విడుదల చేస్తున్నారు. అది కూడా వారబందీ పద్ధతిన 25వ డిస్ట్రిబ్యూటరీ వరకే. దీంతో చివరి ఆయకట్టు వరకు కడెం నీరందని పరిస్థితి ఉంది. జూలై 13న కడెం ప్రాజెక్ట్‌కు వచ్చిన ఇన్‌ఫ్లో 1 టీఎంసీ మాత్రమే కాగా.. అది 21వరకు 4 టీఎంసీలకు చేరింది. జూలై 30 వరకు అది 40 టీఎంసీలకు పెరిగింది. అంటే కేవలం 17 రోజుల్లోనే కడెం ప్రాజెక్ట్‌కు 40 టీఎంసీల నీళ్లు వచ్చాయి. నీటి నిల్వ సామర్థ్యం లేక.. కడెం ప్రాజెక్టు ఆరు రెట్ల నీళ్లు సముద్రం పాలయ్యాయి. ప్రాజెక్టు గేట్ల పైనుంచి నీళ్లు ఉరకలెత్తాయి.



గేట్లు ఎత్తినప్పుడు కుమురం భీం ప్రాజెక్టు

మధ్య తరహా ప్రాజెక్టుల్లోనూ

ఉమ్మడి జిల్లాలో ఉన్న మధ్యతరహా ప్రాజెక్టులైన వట్టివాగు, గడ్డెన్నవాగు, స్వర్ణ, సాత్నాల వంటి ప్రాజెక్టులకు సైతం గత వారం కురిసిన వర్షాలకు భారీగా వరద పోటెత్తింది. ఒక్కో ప్రాజెక్టుకు రెండు, మూడు రెట్లు అధికంగా ఇన్‌ఫ్లో ఉంది. అంతే మొత్తంలో అవుట్ ఫ్లోగా నమోదైంది. వానాకాలం ఆరంభంలోనే ఈ స్థాయిలో వర్షాలు పడ్డాయి. వచ్చే సెప్టెంబర్ వరకు రుతు పవనాల ప్రభావం ఉండనుంది. దీంతో మళ్లీ అధిక వర్షాలు కురిస్తే ప్రాజెక్టులకు మళ్లీ వరద ఉధృతి ఉండనుంది.

ప్రజావాణిపై నమ్మకం పెంచాలి

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: సమస్యలతో కలెక్టరేట్‌కు వచ్చే ప్రజ లకు ప్రజావాణిపై నమ్మకం పెంచాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అధికారులకు సూచించారు. సమీకృత కలెక్టరేట్‌లో సోమవారం అడిషనల్ కలెక్టర్ కిశోర్‌కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణితో కలిసి ప్రజావాణి నిర్వహించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి మాట్లాడారు. ప్రజావాణికి వచ్చి సమస్యలపై ఫిర్యాదు చేస్తే త్వరగా పరిష్కారం అవుతుందనే ప్రజలు ఇక్కడి వరకు వస్తారన్నారు. అర్జీలను పరిశీలించి సమస్యలు త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. పరిష్కరించలేని అర్జీలు ఉంటే ఫిర్యాదుదారులకు అక్కడే తెలియజేయాలన్నారు. సమస్యను బట్టి పై అధికారులకు పంపించాల్సి ఉంటే ఫిర్యాదులను పంపిస్తూ, ఆ కాపీని ఫిర్యాదుదారుకు పంపించాలన్నారు. ఒక సమస్యపై ఫిర్యాదుదారుడు పలు మార్లు వచ్చే పరిస్థితి ఉండకూడదని సూచించారు. ప్రజావాణి ఫిర్యాదులకు అధికారులు తొలి ప్రాధాన్యం ఇచ్చి వారి నమ్మకాన్ని నిలబెట్టాలని ఆదేశించారు. ప్రజావాణిలో మొత్తం 28 ఫిర్యాదులు అందాయని, వాటిని సంబంధిత శాఖలకు పంపిస్తున్నట్లు తెలిపారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించి వ్యాధులకు దూరంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి ధనరాజ్ సూచించారు. జిల్లాలో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్‌లో భాగంగా పట్టణంలోని వైఎస్సార్ నగర్ కాలనీని సోమవారం సందర్శించారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడ ఆయిల్ బాల్స్ వేశారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధిచెంది డెంగీ, మలేరియా, చికున్ గన్యా వ్యాపించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి వేణురావు, ఆరోగ్య పర్యవేక్షకులు భోజారెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యమంలా కదిలారు.. రికార్డు సాధించారు

- జిల్లాలో ఒకేరోజు 5,940 ఇంకుడు గుంతల నిర్మాణం
- దిలావర్‌పూర్‌లో ప్రారంభించిన కలెక్టర్ వరుణ్‌రెడ్డి



ఇంకుడు నిర్మాణం ప్రారంభిస్తున్న కలెక్టర్..

దిలావర్‌పూర్: వాన నీరు భూమిలో ఇంకాలన్న లక్ష్యంతో జిల్లాలో సామూహిక ఇంకుడు గుంతల నిర్మాణాన్ని సోమవారం ఉద్యమంలా చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా ఒక్కరోజే 5,940 ఇంకుడు గుంతలు నిర్మించి లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు సాధించారు. దిలావర్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా 396 గ్రామ పంచాయతీల్లో ఒకే రోజు 5,940 ఇంకుడు గుంతలు నిర్మించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజల సమష్టి కృషే ప్రగతికి మార్గమన్నారు. ఏపనైనా విజయవంతం కావాలంటే సమష్టి కృషి అవసరమన్నారు. ప్రజల కోసం, గ్రామాల అభివృద్ధి కోసం చేసే ఏపనిలో అయినా సమష్టి కృషి ఉంటే దాని ఫలాలు చిరకాలం గుర్తుంటాయన్నారు. అనంతరం పలు శాఖలకు సంబంధించిన అధికారులతో మాట్లాడారు. మండలంలో చేపడుతున్న అభివృద్ధి పనుల గురించి ఆరా తీశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తరగతి గదులు, సౌకర్యాలపై ఆరాతీశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ శంకర్, అధ్యాపకులతో మాట్లాడారు. విద్యార్థులు సాంకేతిక విద్యపై దృష్టిసారించేలా అడుగులు వేయాలన్నారు. ఎంసెట్ ర్యాంకులు సాధించేలా శిక్షణ ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిశోర్, డీఆర్డీవో విజయలక్ష్మి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సుభాష్‌రావు, ఎంపీపీ పాల్దె అక్షర అనిల్, సర్పంచ్ జంగం వీరేశ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ పీవీ.రమణారెడ్డి, తహసీల్దార్ కరీం, ఎంపీడీవో మోహన్, ఏపీవో దివ్యారెడ్డి, ఎంపీవో అజీజ్ ఖాన్, ఐకేపీ ఏపీఎం సులోచన, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏటా సుద్దవాగుతో గోస



పుస్పూర్‌లో సుద్దవాగు ఉధృతికి దెబ్బతిన్న పత్తి పంట

- వరదలకు తుడిచిపెట్టుకుపోతున్న ఖరీఫ్ పంటలు
- పరిహారం ఊసెత్తని అధికారులు, పాలకులు



ఈ ఫొటోలోని రైతుపేరు గన్ను నర్సారెడ్డి, లోకేశ్వరం మండలం పుస్పూర్‌కు చెందిన ఈ రైతు ఈఏడాది ఆరు ఎకరాల్లో పత్తి, రెండెకరాల్లో సోయా, ఎకరంలో మొక్కజొన్న వేశాడు. వారం క్రితం కురిసిన వర్షాలకు సుద్దవాగుకు వరద పోటెత్తింది. దీంతో అన్ని పంటలు కొట్టుకుపోయాయి. మరోవైపు చేను మొత్తం ఇసుక మేటలు వేసింది. ఏటా ఇదే పరిస్థితి ఎదురవుతుండడంతో నర్సారెడ్డి దిక్కుతోచని స్థితిలో ఉన్నాడు.

లోకేశ్వరం: జిల్లాలోని సుద్దవాగు మూడేళ్లుగా వానాకాలం పంటలను తుడిచిపెట్టుకుపోతోంది. జూలై, ఆగస్టు మాసాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు వాగు ఉప్పొంగుతోంది. దీంతో ఖరీఫ్‌లో వేసిన పంటలు పూర్తిగా కొట్టుకుపోతున్నాయి. వరద తగ్గిన తర్వాత అధికారులు సర్వే చేసి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో మూడేళ్లుగా రైతులు నష్టపోతున్నారు.

835 రైతులు.. 1,520 ఎకరాలు..

గతేడాది జూలై, ఆగస్టు, సెప్టెంబర్‌లో భారీ వర్షాలు కురిశాయి. దీంతో మధోల్ నియోజకవర్గంలోని సుద్దవాగు, సీరాల ప్రాజెక్టు పరీవాహక ప్రాంతాల్లో వేసిన పంటలు వరదలకు కొట్టుకుపోయాయి. ఈ ఏడాది కూడా వారం క్రితం కురిసిన వర్షాలకు గతేడాది పరిస్థితే పునరావృతమైంది. లోకేశ్వరం ఒక్క మండలంలో 835 మంది రైతులకు చెందిన 1,520 ఎకరాల్లో పంట నష్టపోయారు. 390 మంది రైతులకు చెందిన 710 ఎకరాల్లో పత్తి, 410 మంది రైతులకు చెందిన 740 ఎకరాల్లో సోయాబీన్, 35 మంది రైతులకు చెందిన 70 ఎకరాల్లో మొక్కజొన్న పంటలు పూర్తిగా కొట్టుకుపోయాయి. మూడేళ్లుగా జూలైలో జరిగిన నష్టాన్ని మాత్రమే అధికారులు అంచనా వేశారు. 2021లో ఆగస్టు, సెప్టెంబర్‌లో జరిగిన నష్టంపై అటు పాలకులు, ఇటు అధికారులు పట్టించుకోలేదు.

ఇప్పటికే రూ.20 వేల పెట్టుబడి..

ఆయా పంటలకు ఇప్పటికే రైతులు రూ.20 వేల వరకు పెట్టుబడి పెట్టారు. దుక్కులు దున్నడం, విత్తనాలు విత్తడం, మొదటి విడత ఎరువులు వేయడం, కూలీల ఖర్చు అన్నీ కలిపి ఎకరాకు రూ.20 వేలకు పైగా ఖర్చయ్యాయని రైతులు పేర్కొంటున్నారు. తాజా వరదలకు చేలల్లో ఇసుక మేటలు వేసింది. మళ్లీ పంటలు వేయాలంటే మొదట ఇసుక మేటలను తొలగించాలి. ఇందుకు మరో రూ.10 వేల వరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాదైనా ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

పరిహారం అందించాలి



సుద్దవాగు ఉధృతికి ఏటా పంటలు నష్టపోతున్నాం. సుద్దవాగు పరీవాహక ప్రాంతంలో ఉన్న ఆరు ఎకరాల్లో ఇటీవల వరి, పత్తి, సోయా, మిర్చి పంటలను వేశాను. వారం క్రితం వచ్చిన వరదలకు పంటలు తుడిచిపెట్టుకుపోయాయి. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలి.

– జెల్ల నారాయణ, మన్మద్ రైతు

సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక..



జిల్లాలో మూడేళ్లుగా కురిసిన భారీ వర్షాలకు సుద్దవాగు, స్వర్ణ, కడెం ప్రాజెక్టుల పరిధిలో జరిగిన పంట నష్టాన్ని ఏవోలు, ఏఈవోలతో సర్వే చేయించాం. ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి పంపించాం. ప్రభుత్వం దీనిపై నిర్ణయం తీసుకుని పరిహారం విడుదల చేస్తే బాధిత రైతులకు అందిస్తాం.

– అంజిప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

దుఃఖదాయినిగా గోదావరి

- వరదల పాపం కేసీఆర్‌దే..
- బీజేపీ ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్
- జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన



బాధిత రైతులతో మాట్లాడుతున్న ఈటల రాజేందర్, మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్/సారంగాపూర్/సోన్: రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్లక్ష్యంతో ఉత్తర తెలంగాణ వరప్రదాయిని అయిన గోదావరి నది దుఃఖదాయినిగా మారిందని బీజేపీ ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ ఆరోపించారు. నిర్మల్ జిల్లాలో సోమవారం పర్యటించారు. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న చించోలి(బి) రోడ్డును పరిశీలించారు. అనంతరం బీజేపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. బీజేపీ ప్రాజెక్టులకు వ్యతిరేకం కాదని, నిపుణుల సూచనలతో నిర్మాణాలు చేపట్టాలన్నారు. ముఖ్యమంత్రి అనాలోచిత నిర్ణయాలతో గోదావరి వరదలు వచ్చినప్పుడు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల బ్యాక్ వాటర్‌లో వేల ఎకరాలు నీట మునుగుతోందన్నారు. ఈ పాపం పూర్తిగా కేసీఆర్‌దే అన్నారు. కడెం ప్రాజెక్టు తెగిపోతే 35 గ్రామాలు కొట్టుకపోయే ప్రమాదం ఉందని నిపుణుల కమిటీ హెచ్చరించినా కేసీఆర్ ప్రభుత్వం, అధికార యంత్రాంగం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సదర్మాట్ కాలువకు గండ్లు పడడంతో 12 వేల ఎకరాల ఆయకట్టు అగమ్య గోచరంగా మారిందన్నారు. ఫసల్‌బీమా అమలు కాకపోవడంతో రైతులకు పరిహారం అందడం లేదని తెలిపారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇల్లు కూలిపోయిన వారికి రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు పడకంటి రమాదేవి, మాజీ ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎండల లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, ఆల్లాపురం శ్రీనివాస్, అయ్యన్నగారి భూమయ్య, రావుల రామనాథ్, పాయల్ శంకర్, నాయుడు మురళీధర్, మల్లికార్జునరెడ్డి, సమరాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

సారంగాపూర్, సోన్ మండలాల్లో పర్యటన..

అనంతరం ఈటల రాజేందర్ సారంగపూర్, సోన్ మండలాల్లో పర్యటించారు. మలక్‌చించోలి, జాఫ్రాపూర్ గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. మలక్‌చించోలి చెక్‌డ్యామ్ ప్రాంతాన్ని పరిశీలించి నీటి భూభాగం గురించి స్థానిక నాయకులను అడిగి తెలుసుకున్నారు. పక్కనే కోతకు గురైన రోడ్డు, పంటలను సందర్శించారు. రైతులు తమ ఆవేదనను వెల్లడించారు. కార్యక్రమంలో అయ్యన్నగారి భూమయ్య, రావుల రాంనాథ్, డాక్టర్ మల్లిఖార్జున్‌రెడ్డి, రాంశంకర్‌రెడ్డి, విలాస్, సాహెబ్ రావు, మధు, రాజేశ్వర్‌రెడ్డి, మేక ప్రేమ్‌కుమార్, రాచకొండ సాగర్, సరికెల గంగన్న, హరీశ్‌రెడ్డి, మార గంగారెడ్డి, ఓడిసెల అర్జున్, మేకల అశోక్, బీజీ.రెడ్డి, రంజిత్, సాయన్న పాల్గొన్నారు.

'కడెం'పై సవతి ప్రేమ

కడెం: కడెం ప్రాజెక్టుపై సీఎం కేసీఆర్ సవతి ప్రేమ చూపిస్తున్నారని ఈటల రాజేందర్ విమర్శించారు. కడెం ప్రాజెక్టును సోమవారం సందర్శించారు. ప్రాజెక్టు స్థితిగతులను తెలుసుకున్నారు. గతేడాది భారీ వరదలతో ప్రాజెక్టు దెబ్బతిన్నా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. వెంటనే మరమ్మతులకు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కడెం ప్రాజెక్ట్ గురించి తనకు తెలియదని మంత్రి కేటీఆర్ అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. హైటెక్‌సిటీ, కమీషన్లు వచ్చే కాళేశ్వరం, రియల్ దందాలు మాత్రం కేటీఆర్‌కు బాగా తెలుస్తాయని ఎద్దేవా చేశారు. కట్ట మైసమ్మే కాపాడాలని స్థానిక మంత్రి అనడం ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనమన్నారు. ఈటల వెంట బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, పెంబి జెడ్పీటీసీ జానుబాయి, ఆయా మండలాల అధ్యక్షులు, నాయకులు ఉన్నారు.

మా ఊరును తరలించండి

కడెం ప్రాజెక్టు వరదలతో ముంపునకు గురవుతున్న తమ ఊరిని తరలించాలని, పునరావాసం కల్పించాలని మండలంలోని పాండ్వాపూర్‌తండా వాసులు ఈటలను కోరారు. పెంబి జెడ్పీటీసీ భుక్య జానుబాయితో కలిసి ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందించారు.



కడెం ప్రాజెక్ట్ వద్ద ఈటల రాజేందర్

క్లుప్తంగా

న్యూవెల్మల్‌లో సేత్వారి సర్వే



సర్వేలో పాల్గొన్న ఏడీ రాథోడ్ సుదర్శన్, తహసీల్దార్ హిమబిందు

సోన్: ఎస్సారెస్పీలో ముంపునకు గురైన మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో దాదాపు సగం మంది రైతులకు భూములు కేటాయించినా సేత్వారి అమలు కాక పట్టా పాసు పుస్తకాలు అందలేదు. ఈ విషయాన్ని రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డికి విన్నవించారు. వారు ప్రత్యేక చొరవ, ఆదేశాలతో జిల్లా ఏడీ రాథోడ్ సుదర్శన్, తహసీల్దార్ రాథోడ్ హిమబిందు న్యూవెల్మల్ గ్రామంలో సోమవారం పర్యటించారు. సేత్వారి సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో పూర్తి సర్వే నిర్వహించి 25 రోజుల్లో రైతులందరికీ పట్టాపాసు పుస్తకాలు మంజూరు చేస్తామన్నారు. మొత్తం విస్తీర్ణంతోపాటు 29 సర్వే నంబర్లలో 95 ఎకరాల భూమి, 31 మంది పట్టాదారులు, 105 మంది లబ్ధిదారుల సర్వే చేసినట్లు తెలిపారు. ఆర్ఐ షేక్ రఫీ, సర్వేయర్లు పుష్ప, పరమేశ్వర్, బాలకృష్ణ, వీడీసీ అధ్యక్షుడు రెమ్మాయి సాగర్, కోశాధికారి కొండ రవి, గ్రామస్తులు పిండి మల్లయ్య, లొడ్డ రాజేశ్వర్, నర్సింగ్ రావు, ఎలుగు రాజలింగం, గొడుగు భూమేష్, రాజేందర్ ఉన్నారు.

హోంగార్డుపై దాడి కేసులో ఒకరికి జైలు

నిర్మల్‌టౌన్/కడెం: హోంగార్డుపై దాడి కేసులో ఒకరికి మూడు నెలల జైలుశిక్షతోపాటు రూ వెయ్యి జరిమానా విధిస్తూ ఖానాపూర్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జితిన్‌కుమార్ సోమవారం తీర్పునిచ్చారు. నిర్మల్ కోర్టు సమన్వయల అధికారి సక్రియ నాయక్, కడెం ఎస్సై రాజు కథనం ప్రకారం.. బండి వెంకటేశ్ కడెం పోలీసుస్టేషన్ హోంగార్డుగా విధులు నిర్వహించేవాడు. 2014, జూన్ 27న ఎస్సై ఆదేశాలతో సమాచార సేకరణ నిమిత్తం కడెం మండలం అకొండపేట్‌కు వెళ్లారు. అదే గ్రామానికి చెందిన నేరస్తుడైన జాడి పోశం, ఇంకొందరు గ్రామస్తులు కలిసి కుచన్పెల్లి రాజన్నతో గొడవపడ్డారు. అతన్ని కర్రతో కొట్టడానికి వస్తున్న పోశంను ఎందుకు కొడుతున్నావని హోంగార్డు వెంకటేశ్ ప్రశ్నించాడు. నీకెందుకురా అంటూ కర్రతో హోంగార్డు తలపై కొట్టాడు. తీవ్ర గాయాలైన వెంకటేశ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్సైలు సతీశ్, రాములు కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్ట్ చేశారు. చార్జిషీట్ దాఖలు చేసి కోర్టులో హాజరుపర్చారు. పీపీ రామకృష్ణ 13 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి, నేరం రుజువు చేయడంతో శిక్ష విధిస్తూ ఖానాపూర్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ తీర్పునిచ్చారు.

జాతీయ నృత్య పోటీలకు విద్యార్థుల ఎంపిక

జన్నారం: డీడీ టీవీ చానల్ న్యూఢిల్లీ ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్య పోటీల్లో మండలానికి చెందిన విద్యార్థులు జాతీయస్థాయికి ఎంపికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో సౌత్‌జోన్ నుంచి స్లేట్ హైస్కూల్ విద్యార్థులు ముగ్గురు, నటరాజ కళాక్షేత్రం విద్యార్థులు ఆరుగురు మొత్తం తొమ్మిది మంది ఎంపికైనట్లు కోఆర్డినేటర్ మనోజ్‌కుమార్, మాస్టర్ నర్మదగౌడ్ తెలిపారు. త్వరలో ఢిల్లీలో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని వారు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

వైన్స్ చోరీలో కొత్త కోణం

- సొత్తుపై కొరవడిన స్పష్టత
- నిర్వాహకులు చెప్పింది రూ.3 లక్షలు
- ఎఫ్ఐఆర్‌లో రూ.70 వేలుగా నమోదు
- పలు అనుమానాలకు దారితీస్తున్న చోరీ



కౌంటర్ నుంచి డబ్బులు తీస్తున్న దొంగ (సీసీ టీవీ ఫుటేజీ)

జైనథ్: జాతీయ రహదారికి కూతవేటు దూరాన భోరజ్ సమీపంలో ఉన్న వైన్స్ షాపులో శనివారం రాత్రి జరిగిన చోరీలో కొత్త కోణం బయటపడింది. దాదాపు 26 పెట్టెల మద్యం, రూ.70 వేల నగదును దుండగులు ఎత్తుకెళ్లినట్లు నిర్వాహకులు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆధారాలు సేకరించి ఆదివారం రాత్రి కేసు నమోదు చేశారు. అయితే నిర్వాహకులు చెప్పిన సొమ్ముకు, పోలీసులు ఎఫ్ఐఆర్‌లో నమోదు చేసిన సొమ్ముకు పొత్తన లేకపోవడం పలు అనుమానాలకు దారి తీస్తోంది. మద్యం, డబ్బులు మొత్తం కలిపి రూ.3 లక్షల వరకు చోరీకి గురైనట్లు నిర్వాహకులు చెప్పారు. రూ.70 వేలు మాత్రమే చోరీకి గురైనట్లు పోలీసులు ఎఫ్ఐఆర్‌లో నమోదు చేశారు. కాగా, చోరీ సొత్తుపై స్పష్టత కొరవడింది.

ఎందుకీ తేడా?

వైన్స్‌షాపులో చోరీని గుర్తించి నిర్వాహకులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. రూ.2.30 లక్షల విలువ చేసే మద్యం, రూ.70 వేల నగదును ఇద్దరు దుండగులు ఆటోలో వచ్చి ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. పోలీసులకు అనుమానం వచ్చి వైన్స్ షాపును పరిశీలించారు. మద్యం, డబ్బులు మొత్తం కలిపి రూ.70 వేలు మాత్రమే చోరీకి గురైందని, నిర్వాహకులు అబద్ధం చెబుతున్నారని అనధికారికంగా వెల్లడించారు. ఇన్సూరెన్స్ డబ్బుల కోసం చోరీకి గురైన సొమ్మును నిర్వాహకులు ఎక్కువగా చేసి చూపుతున్నారని కేసు నమోదు చేయడానికి వెనక ముందు చేశారు. చోరీ విషయం బయటకు పొక్కడంతో కేసు నమోదు చేయక తప్పని పరిస్థితి. రూ.62 వేల విలువ చేసే మద్యంతోపాటు మరో రూ.8 వేల నగదు చోరీకి గురైనట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. నిర్వాహకులు మాత్రం రూ.3లక్షల వరకు చోరీ అయిందని చెప్పడం గమనార్హం.

ఏదీ నిజం ?

వైన్స్ నిర్వాహకులు, పోలీసులు చెబుతున్నదానికి పొంతన లేకపోవడంతో అసలు ఏది నిజం అన్న ప్రశ్న తలెత్తుతోంది. చోరీ కేసుల్లో ప్రాపర్టీ రికవరీ చూపించడం అనే పోలీసుల ప్రాథమిక విధిగా ఉంటుంది. రూ.3 లక్షల వరకు సొత్తు చోరీ అయినట్లు ఎఫ్ఐఆర్ నమోద చేస్తే, అంత మొత్తం రికవరీ చూపించడం కష్టం ఉంటుందని పోలీసులే కావాలనే రూ.70 వేలు మాత్రమే అని నమోదు చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరో వైపు నిర్వాహకుల నిజాయితీపై అనుమానాలు లేవనెత్తుతున్నాయి. ఊరికి బయట ఉన్న వైన్స్‌లో రాత్రి వేళ కౌంటర్‌లో రూ.70 వేల వరకు నగదు ఉంచాల్సిన అవసరం ఏం వచ్చింది? అంత డబ్బులు, మద్యం సీసాలతో నిండిన షాపులో కాపలాగా ఎవరిని ఎందుకు నియమించలేదు? రూ.3 లక్షలు చోరీకి గురైతే ఎఫ్ఐఆర్‌లో రూ.70వేలు అని పోలీసులు రాస్తే, నిర్వాహకులు నోరెందుకు మెదపడం లేదని ప్రశ్నలకు సమాధానాలు లేవు. అసలు సీసీ టీవీలో కనిపిస్తున్న ముసుగు దొంగలు ఎవరు? చోరీకి గురైన సొత్తు ఎంత? నిర్వాహకులు, పోలీసుల చెబుతున్నది ఎవరిది నిజం? అనే ప్రశ్నలకు సమాధానం దొరకాలంటే సీసీ టీవీల్లో రికార్డ్ అయిన దొంగలు దొరకాలి. ఈ విషయమై సీఐ కోల నరేశ్‌ను వివరణ కోరగా, కేసు నమోదు చేశామని, త్వరలో దర్యాప్తు పూర్తి చేసి, పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

స్టీల్ బ్యాంక్ C/O గుండంపల్లి



స్టీల్ బ్యాంకు వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి(ఫైల్)



గుండంపల్లి పంచాయతీలో ఏర్పాటు చేసిన స్టీల్ బ్యాంకు

- ప్లాస్టిక్ వస్తువులు తగ్గించేలా సరికొత్త ఆలోచన
- ప్లాస్టిక్ స్థానంలో స్టీల్ వస్తువుల వాడకం
- శుభకార్యాలకు వినియోగం

దిలావర్‌పూర్: రోజురోజూకు ప్లాస్టిక్ వినియోగం పెరిగిపోతోంది. వాటి వాడకం వల్ల ఎన్నో అనర్థాలకు దారితీస్తోంది. ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్న ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేలా గుండంపల్లి గ్రామ పంచాయతీ సరికొత్త ఆలోచన చేసింది. అదే స్టీల్ బ్యాంక్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ప్లాస్టిక్ స్థానంలో స్టీల్ వస్తువులు ఏర్పాటు చేయడమే దీని ముఖ్యోద్దేశం.

సందర్శించిన కలెక్టర్..

స్టీల్ బ్యాంకు ఏర్పాటు చేసిన గుండంపల్లి పంచాయతీని అధికార యంత్రాంగం సందర్శించి స్వయం సహాయక సంఘాల ప్రతినిధులను అభినందనలు తెలిపింది. ఇటీవల పంచాయతీని సందర్శించిన కలెక్టర్ వరుణ్‌రెడ్డి, డీపీవో శ్రీలత సైతం స్టీల్ బ్యాంకు గురించి ఆరా తీశారు. ప్రజారోగ్యంపై పంచాయతీ ఇలాంటి కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమని కొనియాడారు. స్థానిక సర్పంచ్ సంగీతను అభినందించారు. ఇందుకు తోడ్పాటునందించిన జెడ్పీటీసీ సభ్యుడైన తక్కల రమణారెడ్డిని ఎంపీవో అజీజ్‌ఖాన్, ఎంపీడీవో మోహన్, అధికారులు అభినందిస్తున్నారు.

స్టీల్ బ్యాంకు..ఏమిటీ

ప్లాస్టిక్, పేపర్ గ్లాసులు వినియోగించకుండా ప్రజలను చైతన్య పర్చేందుకు గుండంపల్లి పంచాయతీ, స్థానిక స్వయం సహాయక సంఘాన్ని సమన్వయం చేస్తూ వినూత్న కార్యక్రమం చేపట్టింది. జిల్లాలో మొట్టమొదటిగా గుండంపల్లి పంచాయతీలో స్టీల్ బ్యాంకు ఏర్పాటు చేసింది. ప్రతీ చిన్న చిన్న శుభకార్యాలకు అవసరమయ్యే ప్లేట్లు, గ్లాసులు, స్వీట్ బౌళ్లను అందుబాటులోకి తెచ్చారు. వీటిని ప్రజలు వినియోగించుకునేలా వారిని చైతన్య పరుస్తున్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్, పేపర్ అనర్థాలను ప్రజలకు వివరిస్తూ స్టీల్ వస్తువులపై దృష్టిసారించాలని వివరిస్తున్నారు. వీటి వినియోగం, వాటిని శుభ్రంగా ఉంచేందుకు పంచాయతీ నుంచి ఒక వ్యక్తిని నియమించారు. ప్రతీ శుభకార్యానికి అందేలా చర్యలు తీసుకోవడంతోపాటు తక్కువ చార్జీ చేస్తున్నారు. ఇప్పటికే స్టీల్ బ్యాంకులో 500ల ప్లేట్స్, గ్లాసులు, స్వీట్ బౌల్స్‌ను అందుబాటులో ఉంచారు. భవిష్యత్తులో వినియోగం మేర మరింత విస్తరించేందుకు సిద్ధమని పంచాయతీ, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు వెల్లడిస్తున్నారు.

వైద్యుల సూచనతో..



తన భర్త దిలావర్‌పూర్ జెడ్పీటీసీ సభ్యుడు తక్కల రమణారెడ్డితో కలిసి ఆస్పత్రుల్లో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులను పరా మర్శించాం. వ్యాధుల కారకాలతోపాటు ప్లాస్టిక్ వస్తువులు నిషేధించాలని వైద్యులు సూచించారు. అధికారుల తోడ్పాటుతో పంచాయతీలో స్టీల్ బ్యాంక్ ఏర్పాటు చేశాం. దీనిపై ప్రజలు దృష్టిసారించాలి.

– తక్కల సంగీత, సర్పంచ్, గుండంపల్లి

సఖీ కేంద్రానికి బాలిక అప్పగింత



బాలిక తల్లితో పోలీసులు, అధికారులు

నర్సాపూర్(జి): మండల కేంద్రంలో భిక్షాటన చేస్తున్న బాలికను నిర్మల్ సఖీ కేంద్రానికి అప్పగించినట్లు జిల్లా బాలల సంరక్షణ అధికారి సగ్గం రాజు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నేరడిగొండ మండలం తర్నం గ్రామానికి చెందిన బైండ్ల విజయలక్ష్మి అలియాస్ వైష్ణవి (9) ఆమె తల్లితో నర్సాపూర్(జి) మండల కేంద్రంలో జీవనం సాగిస్తున్నారు. కొన్నిరోజులుగా బాలికను తల్లి సరిగా పట్టించుకోవడం లేదు. మండల కేంద్రంలో బాలిక భిక్షాటన చేస్తూ తిరుగుతుండడంతో గమనించిన గ్రామస్తులు 1098కి సమాచారం ఇచ్చారు. సోమవారం నర్సాపూర్(జి) గ్రామానికి చేరుకున్న జిల్లా బాలల సంరక్షణాధికారితోపాటు, పోలీసులు, అంగన్‌వాడీ టీచర్లు తల్లితో మాట్లాడారు. అనంతరం వైష్ణవిని నిర్మల్ సఖీ కేంద్రానికి తరలించారు. కొన్ని రోజుల తర్వాత ఆమెను బాలికల ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో చేర్పిస్తామని అన్నారు. సర్పంచ్ రాంరెడ్డి, నర్సాపూర్(జి) ఎస్సై రవీందర్, హెడ్‌కానిస్టేబుల్ షౌకత్, చిన్నయ్య, కానిస్టేబుల్ నరేశ్, రజిత, సామాజిక కార్యకర్తలు మమత, నవీన్ ఉన్నారు.

సదర్మాట్‌కు కొనసాగుతున్న వరద



గోదావరిలోకి వెళ్తున్న వరదనీరు

ఖానాపూర్: మండలంలోని మేడంపల్లి గ్రామంలోని సదర్మాట్ బ్యారేజీకి సోమవారం భారీగా వరద పోటెత్తింది. గరిష్ఠ నీటి మట్టం 7.6 ఫీట్లు కాగా, ప్రస్తుతం 9.7 ఫీట్లలో నీటిమట్టం కొనసాగుతోంది. 28,334 క్యూసెక్కుల వరదనీరు గోదావరిలోకి వెళ్తోందని ఏఈఈ ఉదయ్ తెలిపారు.

'గడ్డెన్నవాగు' నీటి విడుదల

భైంసాటౌన్: భైంసా పట్టణ శివారులోని గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు స్వల్ప ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 358.70 మీటర్లు కాగా, సోమవారం 1,122 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, 358 మీటర్లకు చేరింది. దీంతో ప్రాజెక్టు అధికారులు సోమవారం ఒక గేటు ఎత్తి 2,145 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు.

అత్తింటివారి వేధింపులకు వివాహిత ఆత్మహత్య



పూజిత (ఫైల్)



మృతదేహాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సరిత

లోకేశ్వరం: అత్తింటివారి అనుమానం.. పెడుతున్న వేధింపులు భరించలేక వివాహిత చెరువులో పడి ఆత్మహత్య చేసుకుంది. మండలంలోని గడ్‌చాంద గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పెళ్లయిన మూడు నెలలకే తనువు చాలించడంతో విషాదం నెలకొంది. ఎస్సై సాయికుమార్ కథనం.. మండలంలోని బామ్నికే గ్రామానికి చెందిన పూజిత (23)కు అమ్మానాన్న లేరు. చిన్నప్పటి నుంచి వరుసకు నాన్నమ్మ అయిన బ్యాగరి పోసాని ఆమెను పెంచి పెద్ద చేసింది. డిగ్రీ వరకు చదివించింది. మండలంలోని గడ్‌చాంద గ్రామానికి చెందిన బూర్ల సాగర్‌తో పూజితకు గత మే నెల 16న పెళ్లి జరిపించారు. వారి కాపురం సజావుగా సాగింది. కొన్ని రోజులుగా భర్త సాగర్, అత్తమామలు పూజితపై అనుమానం పెంచుకున్నారు. ప్రతిరోజు ఆమెను వేధించసాగారు. తీవ్ర మనస్థాపంతో పూజిత ఈనెల 29న రాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. ఆమె ఆచూకీ కోసం భర్త వెతికినా దొరకలేదు. లోకేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. సోమవారం ఉదయం గడ్‌చాంద సమీపంలోని చెరువులో పూజిత శవమై తేలింది. మృతదేహాన్ని పూజితగా పోలీసులు గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. తహసీల్దార్ సరిత, సర్పంచ్ దేవిసునీతలు మృతదేహాన్ని పరిశీలించారు. పూజిత ఆత్మహత్యకు అత్తింటి వారి వేధింపులే కారణమని మృతురాలి బంధువులు ఆరోపించారు. నానమ్మ పోసాని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్



అర్జీలు స్వీకరిస్తున్న చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజనుల అర్జీల క్షేత్రస్థాయిలో శాఖల అధికారులు పరిశీలించి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో డీడీ దిలీప్‌కుమార్, ఏపీవో కనక భీంరావు, ఏడీఎంఅండ్‌హెచ్‌ఓ కుమ్ర బాలు, ఏవో రాంబాబు, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, పిహెచ్‌ఓ సందీప్, జేడీఎం నాగభూషణం, ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్, ఐటీడీఏ మేనేజర్ లింగు తదితరులు పాల్గొన్నారు.

- గురుకులం పాఠశాలలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగం ఇప్పించాలని నార్నూర్ మండలం భీంపూర్‌కు చెందిన జె.తిరుపతి విన్నవించాడు.
- ఆశ్రమ పాఠశాలలో వర్కర్‌గా నియమించాలని ఉట్నూర్ మండలం వేణునగర్‌కు చెందిన రాథోడ్ అనిత వేడుకుంది.
- ఖానాపూర్ మండలం గంగాయిపేట్ గ్రామానికి చెందిన బాబుషా రామ్ తనకు గృహనిర్మాణం కోసం ఆర్థికసాయం చేయాలని అర్జీ సమర్పించాడు.
- తమకు పోడు పట్టాలు మంజూరు చేయించాలని జన్నారం గ్రామస్తులు విన్నవించారు.
- తనకు ఏఎన్‌ఎం ఉద్యోగం ఇప్పించాలని బేల మండలం ఛాప్రాల గ్రామానికి చెందిన పెందూర్ తార అర్జీ అందించింది.

రైలు నుంచి జారిపడి యువతికి గాయాలు



గాయాలపాలైన స్నేహ

తాంసి: ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి యువతికి గాయాలయ్యాయి. మండలంలోని పొన్నారి వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. బేల మండలం జునోని గ్రామానికి చెందిన పెట్కులే స్నేహ సోమవారం మహారాష్ట్ర కిన్వట్‌లోని బంధువుల ఇంటికి వెళ్లేందుకు పయనమైంది. ఆదిలాబాద్‌లో రైలు ఎక్కి డోర్ వద్ద నిల్చొంది. వేగంగా వెళ్తున్న రైలు.. పొన్నారి శివారు వద్ద రాగానే స్నేహ అదుపుతప్పి జారి కిందపడిపోయింది. తీవ్రగాయాలైన ఆమెను స్థానికులు బంధువులకు సమాచారం అందించి, రిమ్స్‌కు తరలించారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి..



గాయాలైన కిరణ్ కుమార్

నేరడిగొండ: మండలంలోని మాదాపూర్ సమీపంలో బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని కుంటాల ఆశ్రమ బాలికల పాఠశాలలో సీఆర్టీ పీఈటీగా కిరణ్‌కుమార్ విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం ఉదయం డ్యూటీకి వెళ్తున్న క్రమంలో వాగ్దారి, మాదాపూర్ గ్రామాల మధ్య రహదారిపై బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్ర గాయాలైన క్షతగాత్రుడిని స్థానికులు 108లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి..

జైనథ్: మండలంలోని భోరజ్ సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని ఆకుర్ల గ్రామానికి చెందిన అంకుశ్ సోమవారం బైక్‌పై ఆదిలాబాద్‌కు వెళ్తున్నాడు. మహారాష్ట్ర వైపు నుంచి ఆదిలాబాద్ వెళ్తున్న లారీ వెనక నుంచి బైక్‌ను ఢీకొంది. గాయాలైన అంకుశ్‌ను స్థానికులు 108లో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. కాగా, ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ వెనక నుంచి ఢీకొని, లారీతో సహా అక్కడి నుంచి పరారైనట్లు స్థానికులు తెలిపారు.

అడవిపంది దాడిలో మేకల కాపరికి..

జైనథ్: అడవి పంది దాడిలో మండల కేంద్రానికి చెందిన మేకల కాపరి సజ్జులానీకి తీవ్ర గాయాలయ్యాయి. బాధిత కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం.. సజ్జులానీ ఎప్పటిలాగే మేకల మందతో జైనథ్ నుంచి నిరాల వైపు సోమవారం బయల్దేరాడు. పెన్‌గంగ కెనాల్ సమీపంలో మేస్తుండగా ఒక్కసారిగా అడవి పంది అతనిపై దాడి చేసింది. తొడ భాగంలో కరవడంతో గట్టిగా కేకలు వేశాడు. కూత వేటు దూరంలో ఉన్న అతని రెండు పెంపుడు కుక్కలు అడవి పందిపై ఎదురుదాడికి దిగడంతో పారిపోయింది. తీవ్రంగా గాయపడిన సజ్జులానీని స్థానికులు ఆటోలో తరోడ వరకు వచ్చారు. అక్కడి నుంచి నలుగురు ఎత్తుకొని కుంగిన తరోడ బ్రిడ్జి మీదుగా వాగు దాటించారు. మరో ఆటోలో రిమ్స్‌కు తరలించారు.

రుణం ఇప్పిస్తానని వృద్ధురాలికి టోకరా

ఆదిలాబాద్‌టౌన్: బ్యాంక్ ద్వారా రుణం ఇప్పిస్తానని వృద్ధురాలికి చెప్పి ఓ గుర్తు తెలియని వ్యక్తి రూ.12 వేలు టోకరా వేసిన ఘటన పట్టణంలో సోమవారం చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాలు.. పట్టణంలోని రైల్వే క్వార్టర్స్‌లో నివాసం ఉండే వృద్ధురాలు లక్ష్మి తన పెన్షన్ తీసుకునేందుకు శివాజీ చౌక్‌లో గల ఎస్బీఐకి వెళ్లింది. రూ.12 వేలు డ్రా చేసి బయటకు రాగానే గుర్తుతెలియని వ్యక్తి మీకు బ్యాంక్ నుంచి రుణం మంజూరైందని, మున్సిపల్ కార్యాలయ సమీపంలోని బ్యాంక్‌కు రావాలని చెప్పడంతో వెళ్లింది. ఆమెతో ఫారం నింపి సంతకం తీసుకున్నాడు. రుణం పొందాలంటే ముందుగా రూ.12 వేలు కట్టాలనడంతో ఆమె నుంచి డబ్బులు తీసుకున్నాడు. ఇక్కడే ఉండాలని రుణం డబ్బులు వస్తాయని నమ్మబలకడంతో వృద్ధురాలు ఆ బ్యాంక్‌లోనే నిరీక్షించింది. సదరు వ్యక్తి డబ్బులతో ఉడాయించాడు. విషయం తెలుసుకున్న బాధిత వృద్ధురాలు వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

సిరికొండ: మండలంలోని భీంపూర్ సమీపంలోని వాగులో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. గ్రామస్తుల సమాచారంతో పోలీసులు సోమవారం ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుడు ఎవరు అని నిర్ధారణ కాలేదు. గత గురువారం వాగులో కొట్టుకుపోయిన వాయిపేట్ గ్రామానికి చెందిన సంగం గంగాధర్ అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఉధృతమవుతున్న ఉద్యమం

- బోథ్‌ను డివిజన్‌గా చేయాలని పంచాయతీ తీర్మానం
- కలెక్టర్‌ను కలిసిన సాధన సమితి నాయకులు



కలెక్టర్‌కు విన్నవిస్తున్న డివిజన్ సాధన సమితి సభ్యులు

బోథ్: బోథ్ డివిజన్ కోసం చేపడుతున్న ఉద్యమం ఉధృతమవుతోంది. గత 15 రోజులుగా దీక్షలు చేపడుతూ, ప్రతిరోజు ఒక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సోమవారం దీక్షలో విశ్వబ్రాహ్మణుల సంఘం సభ్యులు కూర్చున్నారు. వీరికి పలువురు నాయకులు సంఘీభావం ప్రకటించారు. కాగా బోథ్ మండల కేంద్రాన్ని డివిజన్‌తోపాటు డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని పంచాయతీ తీర్మానం చేసింది. ఈ తీర్మాన ప్రతిని జిల్లా కలెక్టర్‌కు పంపిస్తామని సర్పంచ్ సురేందర్ తెలిపారు. కాగా బోథ్ డివిజన్ సాధన సమితి సభ్యులు కలెక్టర్‌ను కలిశారు. డివిజన్‌గా చేయాలని కోరుతూ పలువురు యువకులు ఆన్‌లైన్ గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు పంపించారు. ధన్నూర్ గ్రామ యువకులు, వీడీసీ నాయకులు పాల్గొన్నారు.

'తుడుందెబ్బ రాష్ట్ర కమిటీకే అధికారం'



మాట్లాడుతున్న తుడుందెబ్బ నాయకులు

ఇంద్రవెల్లి: తుడుందెబ్బ కమిటీలను రద్దు చేసే అధికారం రాష్ట్ర కమిటీ సభ్యులకు ఉంటుందని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్ అన్నారు. మండల కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద జిల్లా స్థాయి నాయకులతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కొందరు స్వార్థ రాజకీయ లబ్ధి కోసం తుడుందెబ్బను విచ్ఛిన్నం చేసే కుట్ర చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాయిసెంటర్ సార్మేడిలు, పటేళ్లను కొవడ నగేశ్ తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించే విషయమై సమావేశం ఏర్పాటు చేసి ఎవరికి తెలవకుండా కమిటీలు రద్దు చేశారన్నారు. ఆయనకు సంఘానికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. తుడుందెబ్బ జిల్లా, మండల కమిటీలు యథావిధిగా కొనసాగుతాయని తెలిపారు. జిల్లా కేంద్రంలో డైట్ గ్రౌండ్‌లో ఈనెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పుర్క బాపురావ్, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు పెందోర్ పుష్పరాణి, ఉపాధ్యక్షురాలు ఇందిరా, జిల్లా నాయకులు శ్యామ్‌రావ్, వెట్టి మనోజ్, నాయకులు సలాం వరుణ్, జుగ్నాక్ భరత్, పుర్క చిత్రు, గేడం భరత్, ముఖడే ఉత్తం, చహకటి మాణిక్‌రావ్ పాల్గొన్నారు.